# దేవుడు వెలసాడు

పల్లవరంలో దేవుడు వెలసాడు.

తెల్లవారేసరికి చుట్టు పక్కల గ్రామాల్లో కారుచిచ్చులా పాకిపోయింది ఆ వార్త. బారెడు పొద్దెక్కేసరికి పల్లవరం వీధులు వచ్చీపోయే జనంతో కిటకిట లాడి పోయాయి.

పాలేర్లు, కూలీలు లేని పంట పొలాలు వెలవెల పోయాయి. సాలె వీధిలో మగ్గాలు ఆగిపోయాయి. దేవాంగుల చేతుల్లో కండెలు నిలిచిపోయాయి. ఏటి మీద తెప్పలు ప్రయాణికుల్ని దాటించడం కోసం చకచక నడచాయి. అంగడిలో వస్తువుల ధరలు అణాకి బేడగా పెరిగిపోయాయి. ఆ గ్రామ చరిత్రలో మొట్టమొదటిసారిగా వీధుల్లో ఎర్ర టోపీలు కనుపించాయి.

ఇంతా చేస్తే, అప్పటికి దేవుడు వెలిసి కొన్ని గంటల కాలమే అయింది. దశాబ్దాల తరబడిగా అడిగేవారు, చూసేవారు లేక ఎర తిన్న పాములా పడి ఉన్న ఆ ఊరు, రైలుకి, బస్సుకి అందుబాటులో లేక కారడవిలో బ్రహ్మజెముడు పొదలా గుర్తింపులేని ప్రాముఖ్యం సాధించుకొంది. సాయంకాలం అయేసరికి వీధులు, వాడలు, ఊళ్ళు, జిల్లాలు దాటి ప్రయాణించింది ఆ వార్త. పత్రికల వాళ్లు పరిగెట్టుకొంటూ వచ్చి పడ్డారు, పల్లవరంలో జరిగిన ఈ వింత ఏమిటో చూసిపోవాలని.

ఎవరి నోట విన్నా ఒకటే మాట. చుట్టుపక్కల ఏ ఊళ్లలో అడిగినా ఒకటే వార్త. "దేవుడు వెలసాడు... దేవుడు వెలసాడు... పల్లవరంలో దేవుడు వెలుసాడు."

పల్లానికి పారే నీళ్లలా ఎక్కడెక్కడి నుంచి బయలుదేరిన వాళ్లూ పల్లవరం వచ్చి పడసాగారు. కాలం గడుస్తుంటే తిండీ, తిప్పలూ కూడా కానకుండా తీర్థప్రజలా ఇంకా ఇంకా రావడం మొదలెట్టారు జనం. ఆడా, మగా, చిన్నా, పెద్దా, చదువుకొన్నవాళ్లూ, చదువులేని వాళ్లూ, ధనవంతులూ, ముష్టివాళ్ళూ, ఒకరేమిటి? ఆ జనప్రవాహానికి ఆది, అంతం లేదు. రాత్రి, పగలు అన్న తేడా లేదు.

దేవుడి ఆవరణలో పల్లవరం ఖ్యాతే కాకుండా, అతడు వెలిసిన ఇంటి యజమాని గోపయ్య గొప్పదనం కూడా పెరిగిపోయింది. అంతకు పూర్వం మందమతి, తెలివి తక్కువవాడు అని ఊరివాళ్లచేత ఈసడింపబడే గోపయ్య ఒక్కసారిగా మహానుభావు డయిపోయాడు.

ఆనాడు రేపల్లెలో నందయ్య ఇంట చిన్ని కృష్ణుడు అవతరించాడు. ఈనాడు పల్లవరంలో గోపయ్య ఇంట శ్రీరామచంద్రుడు సీతాసమేతుడై వెలిసాడు. ఎంత అదృష్టవంతుడు గోపయ్య! ఏం పుణ్యం చేసుకొని పుట్టాడు! అని జనులు గోపయ్య గొప్పతనాన్ని, అదృష్టాన్ని చెప్పుకోసాగారు.

ఊర్లో వాళ్ళ పరిస్థితే ఉక్కిరి బిక్కిరిగా ఇలా ఉన్నప్పుడు ఇంటివాళ్ళు ఆ రామచంద్రుడికి ఆతిథ్యం, సపర్యలు సరిగా సాగుతాయో, లేదో అని కంగారు పడుతూ కాళ్ళు తొక్కుకోడంలో వింత ఏముంది?

పది గంటల వేళ పంచాయతీ సభ్యులు వచ్చి దేవుడి రక్షణ బాధ్యత అందుకొనే వరకు గోపయ్య ఆ చోటు నుంచి కదలలేదు. కన్ను మూసి తెరిచేలోపల ఆ దేవుడు మాయమైపోతాడేమో అన్న ఆరాటంతో అలా విగ్రహాన్ని చూస్తూ ఉండిపోయాడు. వచ్చీపోయే మనుష్యులు దేవుడితోపాటు గోపయ్యకి కూడా పళ్ళూ, పువ్వులూ సమర్పించి మరీ వెళ్లడం మొదలు పెట్టారు.

మరునాటి కల్లా ఊరి మొగలో లెక్కలేనన్ని దుకాణాలు వెలిసాయి. పళ్ళూ, కాయలూ, పువ్వులూ, అగరొత్తులు, శ్రీరామచంద్రులు వారికి పట్టు పీతాంబరాలు, సీతమ్మవారికి మంగళసూత్రాలు, పసుపు కుంకాలు ఒకటేమిటి? తీర్థస్థలాల్లో ప్రజలకి కావలసిన అన్ని వస్తువులు ఆ అంగళ్లలో ఉన్నాయి.

అందరికన్న ఆలస్యంగా ఈ వార్త విన్నవాడు పద్మనాభం ఒక్కడే! అదైనా అర్ధాంగి అందియ్యబట్టి. పల్లవరానికి రెండు వందల మైళ్ల దూరంలో తన ఆఫీసు గదిలో ఏవో అర్జెంటు కాగితాలు చూసుకొంటున్న పద్మనాభాన్ని, "ఏమండి, ఈ వార్త విన్నారా?" అంటూ మేలుకొల్పింది బాలమ్మ.

ఆమె ముఖంలో కనిపిస్తున్న ఉత్సాహం, చేతిలో తెలుగు దినపత్రిక చూసాక ఆమె చెప్పనున్న ఆ వార్త ఏమిటో పద్మనాభం ఇట్టే పసికట్టేసాడు.

"ఏమిటా వార్త? ఆవుకి మూడు తలల దూడ పుట్టిందా లేక, ఆడపిల్ల మగాడుగా మారిపోయిందా? ఇవేగా పేపర్లో నీకు కనిపించే ప్రముఖ వార్తలు!" అన్నాడు, చూస్తున్న కాగితాల్లోంచి తల ఎత్తకుండానే.

"అదికాదండీ, పల్లవరంలో దేవుడు వెలిసాడట!" అంది బాలమ్మ.

"ఇంకేం? ఇన్ని పువ్వులు, పళ్లు పట్టుకు బయలుదేరు."

భర్త వేళాకోళాన్ని బాలమ్మ పట్టించుకోలేదు. ఎలాగైనా అతని దృష్టిని ఆ వార్త మీదికి తిప్పాలని మరో ప్రయత్నం చేసింది.

"దేవుడు వెలిసింది మన ఇంటి పెరట్లోనేటండి" అంది.

"ఏమిటీ?!"

ఈసారి పద్మనాభం చేతిలోంచి వ్రాస్తున్న పెన్ను జారి పడింది. కుర్చీలోంచి అదిరిపడి లేచి, భార్య చేతిలో ఉన్న పేరు అందుకున్నాడు.

"ఇదిగో... ఇక్కడ... ఇక్కడ!" భర్తకి సహాయం చేసింది బాలమ్మ.

"పల్లవరంలో గోపయ్యగారి పెరట్లో శ్రీరామచంద్రుడు సీతాసమేతుడై వెలిసాడు. ఆ దివ్యమంగళ విగ్రహాన్ని చూడడానికి జనం తండోపతండాలుగ వచ్చి పడు తున్నారు..."

అది నాలుగు రోజుల నాటి పేపరు. వర్షాల వల్ల రైళ్లు తినగా నడవక ఆలస్యంగా ఆ రోజు చేరింది.

ముఖం చిటపటలాడిస్తూ ఆ వార్తని మరోసారి చదివాడు పద్మనాభం. చదువుతున్న కొద్దీ అతడి ముఖం మరింత ఎర్రబడింది. కనుబొమలు ముడిపడ్డాయి. కుడిచేతి వేళ్లు జుట్టులోకి పోయాయి.

తన ఇంట ఉంటూ, తన పంట తింటూ ఉన్న బావమరది గోపయ్య, ఊళ్లో ఇంత హంగామా జరుగుతూంటే మాటమాత్రంగానైనా తెలియజేయకపోవడం అతడికి కోపం తెప్పించింది.

సంగతి సందర్భాలు స్వయంగా తెలుసుకోవడానికి వెంటనే పల్లవరం బయలు దేరాడు. ఊరు రమారమి మైలు దూరం ఉందనగానే కారు ఆగిపోయింది.

"ఇంక ముందుకి పోదు బాబూ!" అన్నాడు డ్రైవరు.

ఇసుక వేస్తే రాలనట్లు ఉన్నారు మనుషులు. ఆ జనందోహాన్ని వింతగా చూసాడు పద్మనాభం. 'నిర్మానుష్యంగా దుమ్మురేగుతూ ఉండే ఏటి దిబ్బలేనా ఇవి!' అని ఆశ్చర్యపోయాడు. లెక్కలేనన్ని తాటాకు పందిళ్లు, వాటిలో అంగళ్లు. ఓ చిన్న పట్నం బజారులా ఉంది ఆ ప్రదేశం. గోర్జిదారిపక్క కళ్లంలో ఒక కాఫీ హోటలు, ఊరి ముందు రాంభజన దగ్గర ఒక భోజనశాల వెలిసాయి.

నాలుగు రోజుల్లో ఊరు ఎంతలా మారిపోయింది! మనుషుల్ని తోసుకొంటూ నడుస్తున్నాడు పద్మనాభం. అది తను ఎరిగిన పల్లవరంలా అనిపించలేదు అతనికి. అంతకు పూర్వం అతడు ఆ ఊరు ఎప్పుడు వచ్చినా ఎందరో ఎదుటపడి కుశల ప్రశ్నలు వేసేవారు. మరెందరో నమ్రతతో నమస్కరించి పక్కకి తప్పుకునేవారు. కాని, ఆ రోజు అతని గురించి పట్టించుకొన్న వాళ్లే లేరు. అందరి దృష్టి దేవుడి మీదే! అన్ని మాటలు దేవుడి గురించే!

గోపయ్య ఇంటిముందు జనం ఒత్తిడి మరీ ఎక్కువగా ఉంది. జనాన్ని అదుపులో పెట్టడానికి పోలీసుల లాఠీలు గాలిలో కదులుతున్నాయి. దైవ దర్శనం కోసం ఇంట్లోకి వెళ్లేవారు, తిరిగి వచ్చేవారు. ఒకరికొకరు అడ్డుపడకుండా లావుపాటి మోకులతో దార్లని విడదీస్తూ రెండుగా చేసారు.

తన స్వంత ఇంటిలో ప్రవేశించడానికి పద్మనాభానికి అరగంటకి పైగా పట్టింది. అసలే అలవాటులేని నడకతో అలసి ఉన్నాడు. ఆపైన వెర్రెత్తినట్లు పొంగి పొరలుతున్న జనం తోపిడి. ఆ దేవుడో, దెయ్యమో ఊర్లో ఎక్కడా చోటులేదన్నట్లు తన ఇంటిలో వెలియడం... అన్నీ కలిసి అతడిలో సహనాన్ని పరీక్షకి పెట్టాయి.

ఇంట్లో కాలు పెడుతూనే అనువుగా దొరికిన బావమరిది మీద విరుచుకు పడ్డాడు. "నీకేం బుద్ధీ, జ్ఞానం ఉందా లేదా? ఏమిటీ సంతంతా?" అన్నాడు.

అమాయకుడైన బావమరిది, యాత్రికులచే మహానుభావుడని పొగడబడుతున్న ఆ గోపయ్య బావగారి అకారణ కోపం చూసి హడలిపోయాడు. కాని అంతలోనే తేరుకుని

అసలు విషయం తెలిస్తే అతడు శాంతిస్తాడని భావించి, "మన పెరట్లో దేవుడు వెలసేడు బావా! సీతాసమేతుడై రాముడు వెలసేడు" అన్నాడు ఎంతో ఉత్సాహంగా, మన పెరట్లో నిధి నిక్షేపాలు దొరికాయి అన్నంత తృప్తిగా.

"చెవులు చిల్లులు పడేలా దారి పొడుగునా వింటూన్నమాటే అది. నాక్కావలసింది అది కాదు. ఎలా వెలిసాడు? ఎందుకు వెలిసాడు? ముందుగా ఎవరు చూసేరు? ఈ విషయాలు" అన్నాడు గోపయ్య వేపు తీక్షణంగా చూస్తూ.

"ఎందుకు వెలిసేడంటే నేనెలా చెప్పగలను బావా! మన పూర్వులు చేసిన పూజల ఫలం... మనం చేసుకొన్న అదృష్టం. దేశంలో ఇన్ని ఊళ్లు ఉండగా, ఊర్లో ఇన్ని ఇళ్ళు ఉండగా, మన ఇల్లే వెతుక్కుని ఆ శ్రీరామచంద్రుడు అవతరించాడంటే..."

"అదే నేను అడుగుతున్నది. మన ఇంట్లోనే ఆ దేవుడు ఎందుకు వెలియవలసి వచ్చింది? సూటిగా అడగాలంటే ఎవరు... ఎలా...వెలయించారు? దీనిలో నీ భాగం ఏమిటి?"

"అపచారం బావా, అపచారం! అటువంటి మాటలు మనసులో కూడా అనుకో కూడదు. ఆ దేవదేవుడు..."

"పోనీ, ఇది చెప్పు. ఆ విగ్రహాన్ని ముందుగా ఎవరు చూసేరు?"

"ఒక విధంగా చెప్పాలంటే సత్తెయ్య చూసాడు. కాదంటే ఇద్దరం కలిసే చూసాము."

"ఎవరా సత్తెయ్య?"

"ఆర్నెల్ల కిందట నువ్వు ఇంటి మరామత్తు కోసం వచ్చినప్పుడు కొత్తగా కుదిరాడని చూపించానే... అతడే... మనిషి చాలా మంచివాడు. నేనంటే ప్రాణం పెడతాడు..."

"సరే. వాడినో సారి పిలువు, మాట్లాడాలి" అన్నాడు పద్మనాభం.

గోపయ్య పిలవవలసిన అవసరం లేకుండానే సత్తెయ్య ఏదో పనిమీద తనంతట తనే అటు పక్కగా వచ్చాడు.

"బాగున్నారా సామీ?" అంటూ చొరవగా పలకరించాడు.

పద్మనాభం అతన్ని పరీక్షగా చూస్తూ అతడి పలకరింపుకి జవాబు చెప్పలేదు.

"నేనేనండి సత్తయ్యని, మరిచిపోనారా? పోనసారి మీరొచ్చినప్పుడు అప్పుడే కొత్తగ వచ్చిని గంద... అమ్మగారు ఎల్తూ, ఎల్తూ 'సత్తెయ్యా ఇందరా' అంటూ ఈ నాల్బీ ఇచ్చిన్రు... పసందైన గుడ్డ సామీ... ఆర్నెల్లుగా తొడుగుతున్నా..."

"మరిచిపోలేదు సత్తెయ్యా! ఏదో ఆలోచిస్తున్నాను. ఈ దేవుడు మన పెరట్లో వెలియడం నువ్వే ముందుగా చూసేవంటున్నాడు గోపయ్య. నిజమే నేమిటి?" అని ప్రశ్నించాడు పద్మనాభం.

"మరే సామీ! గోపయ్యగోరు పాదులెట్టడానికి నేల తవ్వమన్నారండి. ఎండెక్కితే కట్టమని సీకటినే పలుగు, పార ఎత్తుకొచ్చే. రెండు బారలు తవ్వేసరికి పలుక్కేదో గట్టిగా తగిల్నాది. బండపడి ఉంటదని గట్టిగా మరో పోటు ఏసా. మళ్లా కంగు మన్నది. అప్పుడే గోపయ్యగోరు.

‘పారతో సుట్టూ మన్ను పెకలించి తవ్వరా’ అన్నారండి. నాలుగు పారల మన్ను తీసేసరికి నల్లగా ఇగ్గరం కనిపించిందండి. ఏటీ ఇంతని మెల్లగా మెల్లగా పైకి తీత్తుంటే గోపయ్యగోరు వచ్చేరండి... ఎర్రి ఎదవని, బండ పద్దదని మరో పోటు ఏసేను. సీతమ్మ తల్లి సేతిలో పువ్వు ఇరిగిపోనా దండి.... ఏటి సెయ్యాలో పాలుపోక ఆరూ, నేనూ సూత్తుండగానే పచ్చిపడిందండి పాడు మూక... ఇంక అప్పటి నుంచీ కాలు కదప సందు లేకుండ ఇట్టగే ఉంది సామీ”

సత్తెయ్య చెపుతున్న వివరాలు వింటూ అతడి వెనకనే దేవుడు వెలిసిన చోటుకి వెళ్లాడు పద్మనాభం. చుట్టూ ఉన్న మూకని చెదరగొట్టి, విగ్రహానికి రెండు బారల దూరంలో అతడు నిలవడానికి చోటు చేసాడు సత్తెయ్య.

పడక గది కిటికీకి పాతిక గజాల దూరంలో ఇంటివైపు తిరిగి ఉంది ఆ విగ్రహం. ఏకశిలమీద చెక్కిన సీతారాముల విగ్రహం అది. రాముడికి ఎడమ వైపున సీత ఉంది. ఆమె కుడి చెయ్యి రాముడి భుజం మీదుగా ఉంది. ఎడమ చెయ్యి ఏదో పట్టుకొన్నట్లో, ఎవర్నో ఆశీర్వదిస్తున్నట్లో పైకి ఎత్తి ఉంది. ఆ చెయ్యి పై భాగం విరిగి ఉంది.

మరికాస్త దగ్గరికి వంగి ఆ విగ్రహాన్ని పరీక్షగా చూసాడు పద్మనాభం. ఆ చేతిలో వుండే పువ్వో, మరే వస్తువో సత్తెయ్య పలుగు తాకిడికి విరిగి పడి ఉంటే, అక్కడి రాయి రంగు మిగిలిన విగ్రహం రంగుకి భిన్నంగా ఉండాలి. విరిగిన చోట అంచులు గరుకుగా ఉండాలి. ఆ విరిగిన చోట రాయి కూడా మిగిలిన విగ్రహం వలెనే పాతపడి ఉంది. తెగిన చోట అంచులు నున్నగా ఉన్నాయి.

విరిగిన విగ్రహాలు పూజకి పనికిరావంటారు. ఆ మాట తప్పించడానికే ఎవరో ఈ ప్రచారాన్ని లేవదీసి ఉంటారు అనుకొన్నాడు పద్మనాభం.

విగ్రహం చూసిన తరువాత అంతకు పూర్వం ఉండే కొద్దిపాటి అనుమానం కూడా అతడికి తీరిపోయింది. అది అక్కడ నేలలో దొరికిన విగ్రహం ఎంత మాత్రం కాదు. ఎంతో కాలంగా నేలలో పాతుకుపోయిన రాయి నిగనిగ లాడుతూ అలా ఉండదు. ఏ మ్యూజియమ్ లోంచో తీసుకొచ్చి అక్కడ పెట్టినట్లుంది దాన్ని చూస్తుటే.

‘ఎవరు పెట్టి ఉంటారు? ఎందుకు పెట్టి ఉంటారు?’

పద్మనాభం మనసులో దొలుస్తున్న ప్రశ్నలవి.

మొదటిదానికి సులువుగానే సమాధానం దొరికిపోయింది. అతడు అక్కడ ఉండగానే దేవుడికి అర్పితమైన పువ్వులు, పళ్లు రెండుసార్లు బయటికి నడిచాయి. అంగడికి తరలివెళ్లి మరో గంటకో, అరగంటకో తిరిగి దేవుడి దర్శనం చేసుకొంటాయి. ఆ ఊళ్లో దేవుడు వెలియుడం వల్ల లాభం పొందిన వాళ్లు ఎందరో ఉంటారు. వారిలో ఎవరైనా చీకటి చాటున ఆ విగ్రహాన్ని తెచ్చి వెర్రి గోపయ్య ఇంట్లో పూడ్చిపెట్టి ఉంటారు.

ఈ నాటకంలో గోపయ్య కేం భాగం ఉన్నట్లు లేదు. పోతే, సత్తెయ్య గురించే ఏమనుకోవడానికి పద్మనాభానికి పాలుపోలేదు. మనిషి స్వతహాగా మంచివాడిలాగే

కనిపిస్తాడు. చదువుకోకపోయిన ఇంతో అంతో ప్రపంచ జ్ఞానం ఉన్నవాడులాగే మాట్లాడుతాడు. మరి అటువంటివాడు అంత నికరంగా దేవుడు వెలిసాడని చెపుతుంటే ఎవర్ని నమ్మేందుకు లేదనుకున్నాడు పద్మనాభం.

ఎన్నిసార్లు ఎన్ని విధాలుగా సత్తెయ్యని ప్రశ్నించినా, మొదట చెప్పిన కథనే తొణకక, బెణకక అప్పచెబుతున్నాడు. ఇంక వాడివల్ల తనకి ఎలాటి వివరాలు అందవని తెలుసుకొన్న పద్మనాభం అటునుంచి నరుక్కు రావాలనుకున్నాడు.

భోజనాల సమయంలో తన మనసులోని మాటను బయట పెట్టాడు.

"అమ్మో... అంత పనే! కళ్లు పోతాయి. పురుగులు పడి చస్తాము" అంటూ వణికిపోతూ, "స్వామీ అపచారం!.... అపచారం" అని లెంపలు వేసుకొన్నాడు గోపయ్య.

"అపచారమో, ఉపచారమో... నేను చెప్పినట్లు చెయ్యవలసిందే. ఎలా చేస్తావో, ఎవరిచేత చేయిస్తావో అంతా నీ ఇష్టం.కాని, ఈ దేవుడు మాత్రం నా ఇంట్లో ఉండడానికి వీలులేదు. ఆ పని ఎంత త్వరలో జరిగితే అంత మంచిది,తెలిసిందా?" అన్నాడు పద్మనాభం నిశ్చలంగా.

"ప్రజలకి తెలిసిందంటే చంపేస్తారు."

"తెలియకుండానే చెయ్యమని చెపుతున్నాను. దేవుడు ఎలా అవతరించాడో అలాగే మాయమైపోయాడు. అంతే!" అన్నాడు భోజనం పూర్తి చేస్తూ.

"ఏదో మేమిలా బ్రతికి ఉండడం ఆ దేవుడికి, మీకు కూడా ఇష్టంలేనట్లు ఉంది.... లేకపోతే, ఎక్కడా చోటు లేనట్లు ఆ దేవుడు ఇక్కడ వెలియడం ఏమిటి? దేవుడు ఇంట్లో ఉంటే మీ పుట్టేదో మునిగిపోయినట్లు మీరు కంగారుపడ్డం ఏమిటి? అంతా మా ఖర్మ" అంది గోపయ్య భార్య తలుపు చాటునుంచి.

"దేవుడి సంగతి నాకు తెలియదు కాని, నా మట్టుకి నేను మీరు సుఖంగా ఉండాలనే కోరుతున్నాను. లేకపోతే ఆ మధ్య అంత సొమ్ము ఖర్చుపెట్టి ఇంటి మరామత్తులు, పాల గచ్చులు చేయించేవాడినా? ఈ ఇల్లు, ఈ పొలం మీకోసం కాకుంటే నా క్కావాలా? మీరలా అనుకొంటే ఈ నిమిషం ఆ రెండూ మీ పేర రాయించేస్తాను సరేనా?" అన్నాడు పద్మనాభం నమ్మకంగా.

పద్మనాభం డబ్బు ఆశ చూపి గోపయ్య భార్య నోరు మూయగలిగాడు కాని, గోపయ్య అంతరాత్మని వశం చేసుకోలేకపోయాడు.

◆ ◆ ◆

"బావకి దేవుడంటే ఇంత కోపం దేనికి? మళ్లా ఏడాది కోసారి తిరుపతి వెళ్లి, ముడుపులు చెల్లిస్తుంటాడే!" అనుకొన్నాడు గోపయ్య.

పల్లవరం నుంచి తిరిగి వచ్చినా పద్మనాభం మనసంతా అటే ఉంది. ఎన్నడూ తెలుగు పేపరు ముఖం చూసి ఎరగని పద్మనాభం, మరునాటి నుంచి దానికోసం ఎదురుచూసి మరీ వెదక సాగాడు, 'పల్లవరంలో దేవుడు మళ్లా అంతర్ధానమయేడు' అన్న వార్త కోసం.

అతడు తిరిగివచ్చి అయిదు రోజులు కావస్తున్నా అటువంటి వార్త పేపర్లో కనిపించ లేదు. అంతేకాక, పుండుమీద కారం జల్లినట్లు, 'పల్లవరంలో దేవుడి కళ్యాణం. భక్తులు ఉదారంగా విరాళాలిచ్చి ఈ మహోత్సవాన్ని జయప్రదం చేయించవలసింది' అంటూ ఒక విజ్ఞాపన ఉంది.

మరి రెండు రోజులు గడిచినా కళ్యాణ వార్తలేకాని, వెలిసిన చోటునుంచి దేవుడు కదిలిన వివరాలేమీ కనిపించలేదు.

'ఈ గోపయ్య ఏం చేస్తున్నట్లు? ఎదుట ఉన్నప్పుడు గంగిరెద్దులా తల ఊపి, చల్లగా జారుకొన్నాడా? అబ్బే! అలా జరిగి ఉండదు. తను ఇల్లూ, పొలం వ్రాసి ఇస్తానంటూ ఆశ చూపించాడు కదా! డబ్బు ముందు దేవుడు, దెయ్యం బలాదూర్. అతడు ఊరుకొన్నా ఆస్తి, డబ్బు అంటే పడిచచ్చే అర్ధాంగి ఊరుకోనివ్వదు.

'అవకాశం కోసం చూస్తూ ఉండి ఉంటారు. అంతమంది మనుష్యుల మధ్య నుంచి ఈ విగ్రహాన్ని మాయం చెయ్యడం అంటే మాటలు కాదు. ఎవరైనా పసికట్టారంటే అతన్ని అక్కడికక్కడే పాతిపెట్టేస్తారు. లేదంటే రాత్రి, పగలు విగ్రహానికి కాపలా పెడతారు.'

పద్మనాభం తన ప్రశ్నలకి తనే జవాబులు వెతుక్కొంటుండగా మరి రెండు రోజులు గడిచాయి. ఎప్పటికప్పుడు పత్రికల మూలంగాను, పల్లవరం వెళ్లివచ్చే మనుషుల మూలంగాను వార్తలు అందుతూనే ఉన్నాయి.

ఆనాడు అందుకొన్న వార్త అతడి గుండెల్ని దడదడ లాడించింది. ఆ కంగారు కప్పుకోవడానికి ఇంట్లో పెళ్లాం, పిల్లల మీద కసురుకోసాగాడు. అతన్ని అంతగా హడలకొట్టిన వార్త ఏమంటే, అక్కడ వెలిసిన శ్రీరాముడి విగ్రహంలో పల్లవుల నాటి శిల్ప విధానం కనిపిస్తున్నదిట. చారిత్రక పరిశోధనల ప్రకారం పల్లవరం పల్లవరాజుల ఆధిపత్యం కిందనే ఉండేదని, అందుకే దానికా పేరు వచ్చిందని కొందరికి అభిప్రాయం ఉందిట. దానిపై పురావస్తుశాఖవారు చర్చలు జరిపి, అక్కడ తవ్వకాలు సాగిస్తే, ఆనాటి చరిత్రకి సంబంధించిన ఎన్నో విషయాలు తెలియవచ్చే అవకాశం ఉంటుందని తీర్మానించారు. ఆ కార్యకలాపాలకి వినాయక పూజ రాముడి విగ్రహం దొరికిన చోటు నుంచే ప్రారంభం కావాలని కూడా తీర్మానించారట.

పద్మనాభం శ్రేయోభిలాషి ఒకరు ఈ తాజా వార్తల్ని అతడికి అందజేసాడు.

"ఆ పల్లెటూర్లో ఇంటికి డబ్బు రాబట్టాలంటే ఇదే మంచి అవకాశం. అవసరం వాళ్లది కాబట్టి, లాభసాటిగా బేరం చేయచ్చు" అంటూ డబ్బు రాబట్టే మార్గం కూడా చెప్పి మరీ వెళ్లాడు.

"అసలే కోతి, ఆపైన సారా తాగింది" అన్నట్లుంది పద్మనాభం పరిస్థితి.

"అంత కంగారు పడేందుకు ఏముంది? డబ్బిచ్చే కదా ఇల్లు తీసుకొంటారు? ఆ పల్లవరంలో ఇల్లుండి మనకి ఒరిగి పోయిందేమిటి? కాదూ, పోదూ అంటే అన్నయ్యకి కాస్త ఇబ్బందిగా ఉంటుంది" అంది బాలమ్మ.

"మీ అన్నయ్యా, నువ్వూ కలిసే ఇంతా చేసారు. ఇంట్లో పడి ఉండి, పొలం పుట్రా చూసుకోవాలి అని తెచ్చిపెడితే, దేవుడు, దెయ్యం అంటూ నా పీకల మీదికి తెచ్చారు. ఇంటి చుట్టూ 'మంది' ఎప్పుడు చేరారో అప్పుడే అనుకొన్నాను ఇలాంటి దేదో జరిగి తీరుతుందని. ఇప్పుడు ఏం చెయ్యడం? ఎలా చావడం?" విసుక్కొంటూ, కసురుకొంటూ పల్లవరం బయలుదేరాడు పద్మనాభం.

అక్కడ అతడు భయపడినంతా అయింది. అప్పటికే ఆర్కియాలజీ డిపార్టుమెంటు వారమంటూ ఓ పదిమంది మనుషులు దిగబడ్డారు.

వారి పనేమిటో, ఎందుకొచ్చారో గ్రామ పెద్దలకి విశదీకరించి చెబుతున్నాడు ఆ బృందం నాయకుడు కృష్ణమూర్తి.

ముందు విరిగి పడేది పద్మనాభం ఇల్లేకదా, తమకేం పట్టిందని వారు చెబుతున్న మాటలకల్లా "కాదు మరీ" అంటూ తలలాడిస్తున్నారు ఆ పెద్దలు.

సమయానికి సరిగా అక్కడ చేరుకున్నాడు పద్మనాభం.

"ఇదిగో, ఇతడే ఆ ఇంటి యజమాని" అని అతన్ని వారికి పరిచయం చేసి తమ చేతులు కడుక్కొన్నారు గ్రామ పెద్దలు.

'రెడ్డొచ్చె మొదలాడు' అన్నట్లు తమ సోదంతా మళ్లా ఓసారి ఏకరువు పెట్టాడు కృష్ణమూర్తి.

అతడు చెప్పినదంతా శ్రద్ధగా విని, "అలా జరిగేందుకు వీలులేదు" అన్నాడు పద్మనాభం.

"మీ వంటి పెద్దలు, చదువుకొన్నవరు ఇలా అనడం భావ్యం కాదు. ఇది మీ ఇంటా, నా ఇంటా ఒరిగే సంపద కాదు. దేశ చరిత్రకి సంబంధించిన ఎన్నో విషయాలు ఈ తవ్వకాల్లో బయటపడే అవకాశం ఉంది. మీరు కాదు, కూడదనడం న్యాయం కాదు" అన్నాడు ఆ బృందంలోని ఒక వ్యక్తి.

"నా తాతలనాటి ఇల్లు. దాన్ని పడగొట్టడం నా కిష్టంలేదండీ" అన్నాడు పద్మనాభం, తిరిగి అదే ధోరణిలో.

"చూడండి, పద్మనాభంగారూ! మీ ఇంటిని ప్రభుత్వం వారు ఊరికే తీసుకోరు. దానికి తగినంత పారితోషికం ఇచ్చి, మరీ స్వాధీనం చేసుకొంటారు. ఎక్కడ కావాలంటే అక్కడ మీరు మళ్లా కొత్త ఇల్లు కట్టుకోవచ్చు" అంటూ నచ్చచెప్ప ప్రయత్నించాడు కృష్ణమూర్తి.

అప్పటికీ పద్మనాభం దిగిరాలేదు. 'తా పట్టిన కుందేటికి మూడే కాళ్లు' అన్నట్లు మాట మార్చకుండా కూర్చున్నాడు.

అతన్ని నయాన ఒప్పించడం జరిగేపనికాదని తెలుసుకొన్నాడు కృష్ణమూర్తి.

"మిమ్మల్ని గౌరవంగా అడుగుతున్నాం. మంచిగా అంగీకరిస్తే సరేసరి. లేకుంటే బలవంతంగా ఇల్లు స్వాధీనపరుచుకోవలసి వస్తుంది" అన్నాడు.

"నా ఇష్టానికి వ్యతిరేకంగా నా ఇంట్లో కాలు పెడితే కోర్టుకి ఎక్కవలసి వస్తుంది" అని వారిని బెదిరించాడు పద్మనాభం.

"సరే. అదే మీ ఇష్టమైతే అక్కడే మాట్లాడుకొందాం" అంటూ కూలీలకి సంజ్ఞ చేసాడు కృష్ణమూర్తి.

అతడి ఆజ్ఞ కోసమే ఎదురు చూస్తున్నట్లు పలుగులు, పారలు, గునపాలు, గంపగొడ్డళ్లు పట్టుకొని ఇంట్లోకి జొరబడ్డారు పనివాళ్లు.

పద్మనాభం పట్నంలో ఊపిరి తిరగని పనిలో ఉంటూ కూడా వీలు కల్పించుకొచ్చి, స్వయంగా దగ్గరుండి చేయించిన పాలగచ్చుపై ఖంగు, ఖంగు మన్నాయి పనిముట్లు.

దేవుడి దర్శనం కోసం ఎంతో దూరం నుంచి వచ్చిన మనుషులకి ఈ తమాషా కూడా తృప్తినే ఇచ్చింది. అక్కడ భూమి కింద ఇంకా ఏం దొరుకుతాయో చూడాలనే కుతూహలంతో దొమ్మిగా తోసుకురాసాగారు.

పోలీసులు వారిని అదుపులో పెట్టి, ఇంటి చుట్టూ దడిలా నిల్చారు. బయటి వాళ్లు లోపలికి పోవడానికి గాని, లోపలి వాళ్లు బయటికి రావడానికి కాని అవకాశం లేనంత కట్టుదిట్టంగా కాపలా కాసారు.

కొత్త గచ్చుమీద ఒక్కొక్క దెబ్బ పడుతూంటే పద్మనాభం బుర్ర గిర్రు గిర్రున తిరగడం ప్రారంభించింది. ఒళ్లంతా చెమటలు పట్టింది. నాలుక తడారిపోయింది. కాళ్లలో నిలిచే శక్తి సన్నగిల్లిపోయింది. ఎలాగైనా అక్కడి నుంచి బయటపడాలని, భయాన్ని బైటికి కనిపించకుండా అదుపులో పెట్టుకోవాలని శతవిధాల ప్రయత్నం చేసాడు. కాని, అతడు ఒక అడుగు వెనక్కివేస్తే, మూడడుగులు ముందుకి పడేలా జనం తోపులు తోస్తున్నారు.

తవ్వకం మొదలు పెట్టడానికి ఎన్నుకొన్న స్థలం దేవుడు వెలిసిన చోటుకి ఎదురుగా ఉన్న గది.

పలుగులు, పారలు చెవులు చిల్లులు పడే ధ్వనులతో ఆ గదిలో నాట్యం చేస్తుంటే, పాతిక గజాల దూరంలో ఉన్న దేవుడు ఆ కార్యకలాపాన్ని చిరునవ్వుతో చూస్తున్నాడు. తన భర్తకి ప్రత్యర్థిగా ఇంకో దేవుడు వెలయబోవడం లేదు కదా అని ఆత్రంగా చూస్తున్నది సీతమ్మ.

గంటకి పైగా పనివాళ్ళు చెమట ఓడ్చగా, చుట్టు పక్కల మనుషులు ఊపిరి బిగపట్టి కుతూహలంగా ఎదురు చూడగా ఒక గునపానికి ఖణేల్ మని తగిలింది ఏదో వస్తువు.

"తవ్వండి... తవ్వండి... పైకి తీయండి!" అంటూ అంతా గోలగా అరవసాగారు. మరి రెండు పోట్లు వేసి, మట్టిలో ఉన్న ఆ వస్తువుని కూలీలంతా పైకి లాగారు.

అదొక పెద్ద ఇనప పెట్టె. పైన రాగిరేకు తాపడం చేసి ఉంది. దాన్ని చూడగానే పద్మనాభం ముఖం పాలిపోయింది.

"మూత విడ కొట్టండి"

అధికారి ఆజ్ఞను పనివాళ్లు అమలు పరిచారు.

"అది నా తాతలు దాచిన నిక్షేపం. తీసేందుకు మీకు హక్కు లేదు. మీకు కావలసినవి విగ్రహాలు, శాసనాలు, వాటి కోసం తవ్వుతున్నారు. ఇది నాది, నాది" అంటూ వెర్రిగా కేకలు పెట్టాడు పద్మనాభం.

ఆ రొదలో అతని మాటల్ని ఎవరూ పట్టించుకోనేలేదు. పెట్టెలో ఏముందో చూడాలనే కుతూహలంతో ముందు ముందుకి తోసుకువస్తున్నారు జనం.

"భూమిలో ఉండే నిధి నిక్షేపాలు ప్రభుత్వం వారి సొత్తని మీకు తెలియదా, పద్మనాభంగారూ!" అంటూ, "పడగొట్టనీండి. అందులో మీ కోసం మీ తాతలు ఏం దాచి ఉంచారో ఈ ప్రజలంతా చూస్తారు" అన్నాడు చిరునవ్వుతో కృష్ణమూర్తి.

భడేలుమని పెట్టె మూత విడింది. అంత పెద్ద పెట్టెనిండా కట్టలు కట్టలుగా కుక్కబడి ఉన్నాయి వంద రూపాయల నోట్లు. అన్నింటిమీద అశోకచక్రం ముద్ర ఉంది.

అంత సొమ్ముని ఒక్కసారిగా చూసి, నోట మాటలేక ఉండిపోయారు జనం. ఆ అవకాశాన్ని వినియోగించుకొని పారిపోవడానికి వ్యర్థ ప్రయత్నం చేసాడు పద్మనాభం.

"ఎక్కడికి పోతా" వంటూ అతడి రెండు రెక్కలు పట్టుకొన్నారు. అంత వరకు అయ్యగారు, అయ్యగారంటూ సలాములు చేసే గ్రామస్తులు.

"మన పని అయినట్లే సత్తెయ్యా! అయామ్ సారీ, మిస్టర్ సత్యనారాయణా! ఇంక మిగిలింది వారి పని" అంటూ పోలీసులవంక చూసాడు కృష్ణమూర్తి.

"మీ పని అయింది కాని, నా పని ఇంకా కొద్దిగా మిగిలి ఉంది. పూచీపడి తీసుకు వచ్చిన ఆ రాముడి విగ్రహాన్ని మ్యూజియమ్ వాళ్లకి భద్రంగా ఇచ్చి రావాలి" అన్నాడు సత్తెయ్య, కాదు సత్యనారాయణ.

"ఇతడు... ఇతడు?" అర్థంకాక గ్రామస్థులు తికమకపడ్డారు.

"మా మనిషే. సి.ఐ.డి. శాఖకి చెందినవాడు. 'పాల కోసం రాళ్ళు మొయ్యడం' అంటారు చూడండి. ఈ దొంగనోట్ల ఆచూకీ లాగి బయట పెట్టేందుకు సత్యనారాయణ ఆర్నెల్లపాటు పాలేరు వేషం వెయ్యవలసి వచ్చింది" అన్నాడు కృష్ణమూర్తి.

"దుష్టుల్ని, అవినీతిపరుల్ని శిక్షించడానికి ఈ కలియుగంలో కూడా దేవుడు అప్పుడప్పుడు ఇలా అవతరిస్తుండాలి, మరి."

పోలీసు కస్టడీలో పద్మనాభం తరలిపోతుంటే వెనుకగా ఎవరో అన్నారామాట.